సాక్షి తిరుపతి
ఆదివారం । 21 । సెప్టెంబర్ । 2025



కైవల్యానదిలో ఆక్రమణలు

వెంకటగిరి పట్టణంలోని కైవల్యానదిలో ఆక్రమణలకు బరితెగిస్తున్నారు. దీనిపై అధికారులు పట్టించుకోవడంలేదు. - IIలో



రోడ్లు విధ్వంసం

కంకర తరలించే టిప్పర్లు ఓవర్‌లోడ్‌తో వెళ్తుండడంతో రోడ్లు ధ్వంసం అవుతున్నా అధికారులు చోద్యం చూస్తున్నారు. - IIలో



ఉత్సాహంగా కళాంగిణి వేడుక

ఏర్పేడు సమీపంలోని తిరుపతి ఐఐటీలో రెండు రోజుల పాటు నిర్వహించిన కళాంగిణి వేడుక ఉత్సాహంగా సాగింది. - IIలో

న్యూస్‌రీల్

రేపటి నుంచి దసరా సెలవులు

తిరుపతి సిటీ: జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు దసరా సెలవులు సోమవారం నుంచి వచ్చే నెల 2వ తేదీ వరకు సెలవులు ప్రకటిస్తూ డీఈఓ కేవీఎన్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్య పాఠశాలలో ప్రభుత్వ ఆదేశాలను పాటించాలని, లేనిపక్షంలో ప్రభుత్వ ఉత్తర్వులను ధిక్కరించి తరగతులను నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

28 నుంచి టీటీడీ విద్యాసంస్థలకు..

టీటీడీ ఆధ్వర్యంలో నడుస్తున్న జూనియర్, డిగ్రీ కళాశాలలకు ఈనెల 28వ తేదీ నుంచి దసరా సెలవులు ప్రకటించినట్లు ఆయా కళాశాలలకు అధికారులు ఆదేశాలు జారీ చేశారు. వచ్చే నెల 5వ తేదీ వరకు సెలవులు కొనసాగిస్తూ కళాశాల యాజమాన్యాలకు ఆదేశాలు ఇచ్చారు. ఇంతలోపు డిగ్రీ ఫస్ట్ ఇయర్ అడ్మిషన్లు పూర్తి చేయాలని అధికారులు విశ్వప్రయత్నం చేస్తున్నారు.

స్కోచ్ పురస్కారం అందుకున్న కలెక్టర్



న్యూఢిల్లీలో అవార్డును అందుకుంటున్న కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి అర్బన్: న్యూఢిల్లీలోని ఇండియా హాబిటాట్ సెంటర్‌లో ప్రతిష్టాత్మకమైన స్కోచ్ గోల్డెన్ అవార్డును ఏపీఎస్పీడీసీఎల్ ఎస్‌ఈ సురేంద్రనాయుడుతో కలిసి కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ శనివారం అందుకున్నారు. చంద్రగిరి మండలంలోని రంగంపేట, కందుల వారిపల్లి, చిన్న రామాపురం గ్రామ పంచాయితీల్లో సమగ్ర అభివృద్ధిలో భాగంగా స్వర్ణ నారావారిపల్లి ప్రాజెక్టుకు సంబంధించి 1600 గృహాలకు సౌర ఫలకాలను ఏర్పాటు చేసినందుకు కలెక్టర్‌కు ఈ అవార్డు దక్కింది. ఈ క్రమంలో పలువురు అవార్డు అందుకున్న కలెక్టర్‌కు అభినందనలు తెలిపారు.

తమిళ జాలర్ల బోటు పట్టివేత

వాకాడు : మండలంలోని శ్రీనివాసపురం గ్రామ సముద్ర తీరంలో అక్రమంగా వేట సాగిస్తున్న తమిళ జాలర్ల స్పీడు బోటును శుక్రవారం రాత్రి శ్రీనివాసపురం మత్స్యకారులు అడ్డుకుని బోటును అదుపులోకి తీసుకున్నారు. స్థానిక మత్స్యకారుల వివరాల మేరకు అర్ధరాత్రి సమయంలో తీరానికి దగ్గరగా తమ పరిధిలో అక్రమ వేట సాగించి మత్స్య సంపదను దోచుకుపోతున్న కారికల్ ప్రాంతానికి చెందిన జాలర్లతో పాటు వారి బోటును అదుపులోకి తీసుకున్నారు. బోటులో ఉన్న కారికల్ జాలర్లు 14 మందితో పాటు స్పీడు బోటును నెల్లూరు జిల్లా జువ్వలదిన్నె పోర్టులో మత్స్యకార పెద్దలకు అప్పజెప్పారు.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక



క్రీడాకారులను అభినందిస్తున్న జిల్లా కార్యదర్శి, ప్రశాంత్, ప్రిన్సిపల్

తిరుపతి ఎడ్యుకేషన్: జాతీయస్థాయి జూనియర్ త్రోబాల్ చాంపియన్‌షిప్ పోటీలకు తిరుపతి క్రీడాకారులు ఎంపికయ్యారు. ఈనెల 24 నుంచి 27వ వరకు బెంగుళూరు వేదికగా జాతీయ స్థాయి జూనియర్ త్రోబాల్ చాంపియన్‌షిప్ పోటీలను నిర్వహించనున్నారు. ఈ పోటీలకు ఆంధ్రప్రదేశ్ జట్టుకు తిరుపతి నుంచి ముగ్గురు క్రీడాకారులు ఎంపికయ్యారు. తిరుపతిలోని ప్రశాంత్ స్కూల్‌కు చెందిన విద్యార్థులు కిరణ్ కుమార్, రేహాన్ షేక్, నవదీప్ రాష్ట్ర జట్టుకు ఎంపికవ్వడంపై త్రోబాల్ అసోసియేషన్ తిరుపతి జిల్లా కార్యదర్శి చీనేపల్లి కిరణ్‌కుమార్ హర్షం వ్యక్తం చేశారు. శనివారం ఆ పాఠశాల ఆవరణలో జాతీయ స్థాయి త్రోబాల్ పోటీల్లో పాల్గొననున్న ఆ ముగ్గురి క్రీడాకారులను జిల్లా కార్యదర్శి, ఆ పాఠశాల ప్రిన్సిపల్ లక్ష్మీశ్రీ అభినందించారు.

శ్రీవారి సేవలో విద్యాధీశ తీర్థ స్వామీజీ



పీఠాధిపతి విద్యాధీష తీర్థ స్వామీజీతో అధికారులు

తిరుమల: తిరుమల శ్రీవారిని ఉడిపిలోని పలిమారు మఠం పీఠాధిపతి విద్యాధీశ తీర్థ స్వామీజీ శనివారం దర్శించుకున్నారు. తిరుమల బేడి ఆంజనేయ స్వామి వద్దకు చేరుకున్న ఆయనకు టీటీడీ ఆలయ డిప్యూటీ ఈవో లోకనాథం, పోటు పేస్ కార్ మునిరత్నం ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం ఆయనకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

జెండా అండగా.. జయం



చేతితో జెండాకు తుది మెరుగులు దిద్దుతున్న చిత్ర కారిణి సునంద



గూడూరు టవర్ క్లాక్ వద్ద ఏర్పాటు చేసిన కటౌట్

ఆ ప్రాంతంలో ఎటుచూసినా విద్యుత్ దీపాలు వెలుగులీనాయి. ప్రతి వీధిలోనూ ఆధ్యాత్మికత ఉట్టిపడేలా అలంకరణలు, పోటాపోటీ కటౌట్లతో ముందే దసరా సంబరాలు ఊపందుకున్నాయి. యువత తమ భక్తిని చాటుకునేలా ప్రతి వీధిలో జెండా పండుగను నిర్వహించేందుకు సన్నద్ధమయ్యారు. గూడూరులో ఎక్కడ చూసినా జెండా హోరు.. జోరు కనిపించింది. పట్టణంలో ఆంజనేయస్వామి జెండాలను ఎగుర వేసి తమ భక్తి భావాన్ని చాటుకునేందుకు అంతా సిద్ధమయ్యారు.

దసరాకు ముందుగా గూడూరులో జెండా పండుగ

- మైసూరు తరువాత అత్యంత ఘనంగా వేడుకలు
- నేడు ఉత్సవాలు ప్రారంభం



శివాలయం వద్ద ఏర్పాటు చేసిన అలంకరణ

చిల్లకూరు : గూడూరులో 77 ఏళ్లుగా మైసూరు తరహాలో దసరాకు ముందుగా వచ్చే జెండా పండుగను అత్యంత వైభవంగా నిర్వహిస్తూ వస్తున్నారు. ఈ క్రమంలో ఈ ఏడాది ఆదివారం అమావాస్య రావడంతో జెండా పండుగను వైభవంగా నిర్వహించేందుకు నిర్వాహకులు సన్నాహాలు ఏర్పాటు చేశారు. ఈ క్రమంలోనే పట్టణంలోని పలు వీధులు రెండు రోజులు నుంచి విద్యుత్ దీపాల వెలుగుల్లో కాంతులీనుతున్నాయి.

మైసూర్ తరువాత గూడూరులోనే..

శరన్నవరాత్రులు మైసూర్‌లో వైభవంగా జరగడం తెలిసిందే. అయితే నవరాత్రి ఉత్సవాలకు ముందుగా అమావాస్య రోజున జరిగే ఆంజనేయస్వామి జెండా పండుగ మాత్రం మైసూర్‌లో జరిగినంత దేశంలో మరెక్కడా జరగవు. అటు తరువాతి స్థానం గూడూరుకే దక్కుతుంది. తొలి నాళ్లలో ఐదు ప్రాంతాలలో జెండా పండుగను నిర్వహిస్తుండగా నేడు పట్టణం అంతా విస్తరించడంతో సుమారుగా 50 ప్రాంతాలలో జెండా పండుగను వైభవంగా నిర్వహిస్తున్నారు.

జెండా పండుగ నేపథ్యం

స్వాతంత్ర్యం వచ్చిన తొలినాళ్లలో గూడూరులో పలు రకాల వ్యాధుల బారిన పడి పలువురు మృతి చెందారు. దీంతో ఆందోళనకు గురైన స్థానికులు బొడ్డుచౌక ప్రాంతంలో తెల్లని వస్త్రంపై సంజీవని పర్వతం మోస్తున్నట్లు బొగ్గుతో గీసిన ఆంజనేయుని చిత్రాన్ని గీసి 8 అడుగుల కర్రపై జెండాను అమర్చి గ్రామోత్సవం చేశారు. అప్పుడు గ్రామంలోని ప్రజలు వ్యాధుల బారిన పడిన వారి సంఖ్య తగ్గుముఖం పట్టిందని నమ్మకం. అలా అప్పటి నుంచి విజయదశమి ముందు వచ్చే అమావాస్య రోజున అంజన్న జెండా పండుగను నిర్వహించడం సంప్రదాయంగా వస్తోంది. ప్రతి వీధిలో ఒక జెండాను ఎగురవేసి తమలోని భక్తిని చాటుకునేలా చేస్తున్నారు.

ప్రత్యేక ఆకర్షణగా డీజేలు

జెండా పండుగను తెనాలి బ్యాండు, కేరళ, వాయిద్యాలు, బేతాళ నృత్యాలు, డీజేలు ఏర్పాటు చేస్తున్నారు. దీనికి తోడుగా ప్రతి చోటా ఒకరిని మించి మరొకరు విద్యుత్ దీపాలతో చేసిన కటౌట్‌లు, రంగ రంగుల దీపాలను వెలిగించేలా చూస్తుండడంతో పండుగలో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి.

అంజన్న చిత్రాలు వేసి అందిస్తూ..

బొడ్డు చౌక ప్రాంతానికి చెందిన సునంద అనే చిత్రకారిణి ఆంజనేయస్వామి చిత్రాలను వేస్తామని ముందుకు వచ్చారు. అలా ఐదేళ్ల నుంచి ఆమె సుమారు ఆరు ప్రాంతాలలో నిలిపే ఆంజనేయ చిత్రాలను తీర్చిదిద్ది నిర్వాహకులకు అందిస్తున్నారు.

రూ.కోట్లలో ఖర్చు

జెండా పండుగను ప్రతి ఒక్కరు పోటా పోటీగా నిర్వహించేలా చేస్తుండడంతో ఏటా ఖర్చు బారీగా పెరిగిపోతోంది. దీంతో ఏటా జెండా పండుగ రోజు సుమారు రూ. 20 నుంచి 25 కోట్ల వరకు ఖర్చు అవుతుందని అంచనా.



కోదండరామస్వామి ఆలయం కోనేరు వద్ద ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాల ఆర్చ్



పట్టణంలోని వీధుల్లో అలంకరణలు

పోలీసుల ప్రత్యేక భద్రత

జెండా పండుగ రోజు పాత కక్షలు ఊపందుకుంటూ ఉంటాయి. ఈ క్రమంలో పండుగ జరిగే రోజు ఏదో ఒక చోట ఘర్షణలు చెలరేగి దాడులకు పాల్పడుతుంటారు. ఈ క్రమంలో గతేడాది కూడా రెండు వర్గాల మధ్య ఘర్షణలు జరిగి కత్తి పోట్లకు గురైన సంఘటనలు ఉన్నాయి. ఇలాంటి ఘటనలు దృష్టిలో ఉంచుకుని గూడూరు డీఎస్పీ గీతాకుమారి జెండా పండుగలో డీజేను అనుమతించేది లేదని చెబుతూ పట్టణంలోని పలువురు రౌడీ షీటర్లకు కౌన్సిలింగ్ ఇచ్చారు. పండుగను శాంతియుతంగా జరుపుకోవాలని సూచిస్తున్నారు.

ప్రీ పీహెచ్‌డీ పరీక్షలకు దరఖాస్తు చేసుకోండి

తిరుపతి సిటీ: ఎస్వీయూ పరిధిలో పీహెచ్‌డీ డిగ్రీ కోసం పరిశోధన చేస్తున్న ఫుల్ టైమ్, పార్ట్ టైమ్ విద్యార్థులు ప్రీ పీహెచ్‌డీ పరీక్షలకు సంబంధిచి దరఖాస్తు చేసుకోవాలని పరీక్షల నియంత్రణాధికారి ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు అక్టోబర్ 15 లోపు రూ.3,715 ఫీజు చెల్లించాలని, అపరాధ రుసుముతో అక్టోబరు 30 వరకు గడువు ఉంటుందని, నవంబర్‌లో పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలియజేశారు. మరిన్ని వివరాలకు వర్సిటీ అధికారిక వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

కన్నీటిపాలు

రామచంద్రాపురం : ఆరుగాలం కష్టపడి, కంటికి రెప్పలా కాపాడుకున్న పంట నీట మునగడంతో రైతులు లబోదిబోమంటున్నారు. మండలంలో కురిసిన వర్షాలకు చేతికొచ్చిన వరి పంట నీట మునిగింది. మరో రెండు రోజుల్లో పంటను కోసేందుకు సిద్ధంగా ఉన్న రైతులకు వరుణిడి దాటికి ఆశలు అడియాశలయ్యాయి. పంట చేతికి రాకపోగా అప్పులు మిగలడంతో అన్నదాతల దిక్కుతోచని స్థితికి చేరుకున్నారు. మండలంలో మూడు రోజుల పాటు భారీగా వర్షపాతం నమోదైంది. దీంతో పొలాల్లో కోతకు సిద్ధంగా ఉంచిన వరి పంట నీట మునిగింది. ఫలితంగా పొలాల్లోనే వరి పంట నీట మునగడంతో రెండు రోజులుగా మొలకలు వచ్చాయి. పంట చేతికి వచ్చే పరిస్థితి లేక పోవడంతో అన్నదాతలు విలపిస్తున్నారు.



అకాల వర్షంతో కోతకు వచ్చిన వరి పంట నీట మునిగిన దృశ్యం

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అనుబంధ విభాగాల కమిటీ నియామకం

తిరుపతి అన్నమయ్యసర్కిల్ : వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ రాష్ట్ర అనుబంధ విభాగాల కమిటీ నియామకాలకు సంబంధించి శనివారం పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. రాష్ట్ర వైఎస్సార్‌టీయూసీ జోనల్ అధ్యక్షుడిగా తిరుపతికి చెందిన నారపరెడ్డి రాజారెడ్డి, రాష్ట్ర ఎస్సీ సెల్ సెక్రటరీగా శ్రీకాళహస్తికి చెందిన సి.రాజేంద్ర నియమితులయ్యారు. అదే విధంగా రాష్ట్ర సోషల్ మీడియా విభాగ కార్యదర్శిగా సూళ్లూరుపేట నియోజకవర్గానికి కల్లూరి ఈశ్వర్‌దత్ ఆదర్స్‌ను నియమించినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

స్విమ్స్‌లో పలు కోర్సులకు ఫైనల్ కౌన్సెలింగ్

తిరుపతి సిటీ: స్విమ్స్ వర్సిటీలో బీఎస్సీ నర్సింగ్, బ్యాచులర్ ఆఫ్ ఫిజియోథెరపీ, బీఎస్సీ అలైడ్ హెల్త్ సైన్స్ కోర్సులకు 3వ విడత ఫైనల్ ఆఫ్‌లైన్ కౌన్సెలింగ్ ప్రక్రియను ఈనెల 26న నిర్వహించనున్నట్లు రిజిస్ట్రార్ డాక్టర్ అపర్ణ ఆర్ బిట్లా ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన అభ్యర్థులు ఏపీఈఏపీసెట్-2025 ర్యాంకు, రూల్ ఆఫ్ రిజర్వేషన్‌కు లోబడి సీట్లు కేటాయించనున్నట్లు తెలియజేశారు.

ట్యాంకుల శుభ్రతపై కదిలిన అధికారులు



గోవర్ధనపురంలో కాలువలో ఉన్న కొళాయిని తొలగించేందుకు సూచనలిస్తున్న అధికారులు



చర్మవ్యాధితో బాధపడుతున్న బాలుడు పోలయ్యకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యురాలు

వరదయ్యపాళెం : తాగునీటి ట్యాంకుల శుభ్రత, పైపులైన్ లీకేజీలు, పారిశుద్ధ్యం, మూలనపడ్డ నీటి పరీక్షలు గురించి ఈనెల 19న ప్రజల వేదన కథనం సాక్షి దినపత్రికలో ప్రచురితమైంది. దీనిపై జిల్లా యంత్రాంగం స్పందించింది. డీపీఓ, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ మండలాల వారీగా ఆయా శాఖల అధికారులతో సమీక్షించి తక్షణమే ట్యాంకుల శుభ్రత, పారిశుద్ధ్యంపై చర్యలు తీసుకోవాలని ఆదేశాలు ఇచ్చారు. ఆ మేరకు వరదయ్యపాళెం మేజర్ పంచాయతీలో హైస్కూల్ గిరిజన కాలనీలో చర్మవ్యాధితో ఇబ్బందిపడుతున్న

సాక్షి ఎఫెక్ట్..

బాలుడు పోలయ్యకు స్థానిక వరదయ్యపాళెం సచివాలయం-1లో నిర్వహించిన వైద్య శిబిరంలో డాక్టర్ ద్వైత పరీక్షలు చేసి వైద్యం చేపట్టారు. అలాగే గోవర్ధనపురంలో మురుగు కాలువలో ఉన్న తాగునీటి కొళాయిని తొలగించేందుకు చర్యలు చేపట్టారు. అలాగే మండలంలో ట్యాంకుల శుభ్రతపై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నీలిమ, ఇన్‌ఛార్జ్ ఈఓపీఆర్డీ బసిరెడ్డి పంచాయతీ కార్యదర్శులతో సమీక్షించారు.

శ్రీవారి దర్శనానికి 18 గంటలు

తిరుమల: తిరుమలలోని క్యూకాంప్లెక్స్‌లో 31 కంపార్ట్‌మెంట్లు నిండాయి. శుక్రవారం అర్ధరాత్రి వరకు 71,249 మంది స్వామివారిని దర్శించుకోగా 22,901 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.4.04 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టికెట్లు లేని భక్తులకు 18 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది.

రోడ్డెక్కిన విద్యుత్ ఉద్యోగులు

- ఎస్పీడీసీఎల్ ముందు ఆందోళన
- సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్



ఆందోళన చేస్తున్న విద్యుత్ ఉద్యోగులు

తిరుపతి రూరల్ : విద్యుత్ ఉద్యోగుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ అన్ని ఉద్యోగ సంఘాలు ఏకమై ఆంధ్రప్రదేశ్ స్టేట్ పవర్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) ఆధ్వర్యంలో శనివారం రోడ్డెక్కారు. విధులు బహిష్కరించి కార్పొరేట్ కార్యాలయం ముందు ఆందోళన చేపట్టారు. ఉద్యోగుల సమస్యలను పరిష్కరిస్తామని గతంలో అంగీకరించి ఆపై అమలు పరచకుండా కాలయాపన చేస్తున్నారని మండిపడ్డారు. జేఏసీ నేతలు దేవేంద్ర రెడ్డి, గోపి, ఐ.సుబ్రమణ్యం, చలపతి, జనార్ధన్‌రావు, నందగోపాల్, జయరామయ్య, మునస్వామి మాట్లాడుతూ ఇప్పటికే సమస్యలకు సంబంధించిన నోటీసును యాజమాన్యానికి అందించామన్నారు.

ఉద్యోగుల డిమాండ్లు ఇవి

- విద్యుత్ ఉద్యోగులకు, పెన్షనర్లకు వారి కుటుంబ సభ్యులకు పూర్తి వైద్య ఖర్చులు చెల్లించాలి.
- రాష్ట్ర ప్రభుత్వం అమలులో ఉన్న జీపీఎఫ్‌తో కూడిన పెన్షన్ నిబంధనలను 1.2.1999 నుంచి 31.8.2004వరకు నియమితులైన ఉద్యోగులందరికీ వర్తింపచేయాలి.
- అవుట్‌సోర్స్, కాంట్రాక్టు లేబర్ పద్ధతిలో పనిచేస్తున్న ఉద్యోగులకు యాజమాన్యమే నేరుగా వేతనాలు చెల్లించాలి.
- కారుణ్య నియామకాలు కల్పించడంలో కొత్త, కొత్త పేర్లు పెట్టి కన్సాలిడేట్ పే ఇస్తున్న పద్ధతిని వెంటనే రద్దు పరచి గత నాలుగు దశాబ్దాల నుంచి అమలులో ఉన్న పద్ధతినే కొనసాగించాలి.
- 2019లో నియమితులైన ఎనర్జీ అసిస్టెంట్లు (జేఎల్‌ఎం గ్రేడ్-2)ను రెగ్యులర్ జేఎల్‌ఎంలుగా పరిగణించి వేతనాలు, ఇతరత్రా ప్రయోజనాలను వర్తింప చేయాలి.
- ఉద్యోగ సంఘాలతో కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం మూడేళ్ల నుంచి జరుపుతున్న పద్ధతిలోనే పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలు, డీఆర్‌లను మంజూరు చేయాలి.
- ఇంజినీరింగ్ డిగ్రీ కలిగిన జూనియర్ ఇంజినీర్లకు, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లుగా పదోన్నతి అవకాశం కల్పించాలి.
- ఆపరేషన్స్ అండ్ మెయింటెనెన్స్‌లో పనిచేసే ఉద్యోగులను జూనియర్ అసిస్టెంట్, జూనియర్ ఇంజనీరు పోస్టుల్లో నియమించాలి.
- ఎంతో కాలంగా డిపార్ట్‌మెంట్ ఉద్యోగులతో నిర్వహించే 33/11కేవీ సబ్ స్టేషన్లను కాంట్రాక్టుకు ఇవ్వడం ఆపాలి.
- మూడు నెలలకోసారి సర్కిల్ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు పీఎన్‌సీ సమావేశాలను నిర్వహించాలి.
- గతంలో అంగీకరించిన విధంగా అన్ని విభాగాల్లోని ఖాళీలను భర్తీ చేయాలి, పని ప్రమాణాలను బట్టి అదనపు పోస్టులు మంజూరు చేయాలి.
- క్షేత్ర స్థాయిలో ప్రమాదాలు జరిగినప్పుడు సాంకేతికపరమైన అంశాలను పరిగణనలోకి తీసుకుని, సమగ్ర విచారణ జరిపిన తరువాతనే చర్యలు తీసుకోవాలి.

క్లుప్తంగా

సులభ రీతిలో బోధించాలి



కిట్లను పంపిణీ చేస్తున్న ఏపీసీ గౌరీ శంకర్

చంద్రగిరి : ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు సులభ రీతిలో బోధించడంపై ఉపాధ్యాయులు దృష్టి సారించాలని జిల్లా సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ గౌరీశంకర్ అన్నారు. శనివారం ఆయన మండల పరిధిలోని ఐతేపల్లి ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన ఉపాధ్యాయుల సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి పాఠశాలలో ఇలాంటి సమావేశాలను సమర్థవంతంగా నిర్వహించి, బోధన మెరుగుపరచాలన్నారు. విద్యార్థులు సాధించాల్సిన నైపుణ్యాలపై ప్రత్యేక శిక్షణ ఇవ్వాలన్నారు. అనంతరం ఆయన 1, 2వ తరగతి చిన్నారులకు సులభతరంగా విద్యనందించేందుకు ఉపయోగపడే ఎఫ్ఎల్ఎన్, జాదూ, టీపీఆర్ఎల్ కిట్లను ఉపాధ్యాయులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఎంఓ శివ శంకరయ్య, ఎంఈఓలు లలిత కుమారి, భాస్కర్ బాబు, హెచ్ఎం జయరాం నాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పోక్సో కేసులో రిమాండ్

పాకాల : నాలుగో తరగతి చదువుతున్న బాలికపై అఘాయిత్యానికి పాల్పడిన నిందితుడు మహ్మద్అలీ (శివ)కు స్థానిక కోర్టు న్యాయమూర్తి పూర్ణిమాదేవి రిమాండ్ విధించారు. శనివారం స్థానిక పోలీసులు తెలిపిన వివరాల మేరకు ఈనెల 18న.. 7గంటల ప్రాంతంలో నిందితుడు ఓ బాలికపై లైంగిక దాడికి యత్నించాడు. ఈ విషయంపై శుక్రవారం ఫిర్యాదు అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి శనివారం కోర్టులో హాజరు పరిచారు. విచారించిన న్యాయమూర్తి నిందితుడికి రిమాండ్ విధించి, చిత్తూరు సబ్ జైలుకు తరలించారు.

రూ.12 లక్షల నగదు స్వాహా

నాయుడుపేట టౌన్ : నాయుడుపేట పట్టణంలోని రెండు థియేటర్లను లీజు తీసుకొని సురేష్ ప్రొడక్షన్స్‌కు చెందిన రూ.12 లక్షలు నగదు స్వాహా చేసిననట్లు శనివారం పోలీసులు కేసు నమోదు చేశారు. పట్టణంలోని శ్రీ వెంకటేశ్వర, సీఎస్ తేజ థియేటర్లకు సంబంధించి బ్యాంక్‌కు నగదు లావాదేవీలు జరిపే వెలుగు వెంకట సాయి అనే వ్యక్తి మూడు నెలలుగా బ్యాంక్‌కు నగదు తక్కువగా చెల్లిస్తూ సుమారు రూ.12 లక్షల వరకు స్వాహా చేసినట్లుగా గుర్తించిన విషయం తెలిసిందే. థియేటర్ల యాజమాన్య ప్రతినిధులు ఇచ్చిన ఫిర్యాదుపై సీఐ బాబి కేసు నమోదు చేశారు.

రోడ్లు విధ్వంసం

- ఓవర్‌లోడ్‌తో కంకర లారీల రాకపోకలు
- పరిమితికి మంగళం పాడిన అధికారులు
- చోద్యం చూస్తున్న అధికారులు



ధ్వంసమైన చిన్న పాండూరు-నాగలాపురం ఆర్ అండ్ బీ రోడ్డు

వరదయ్యపాళెం : కంకర తరలించే టిప్పర్లు నిబంధనలు పక్కన పెట్టి ఓవర్ లోడ్‌తో ఇష్టారాజ్యంగా రాకపోకలను సాగిస్తున్నాయి. దీంతో ఎక్కడికక్కడ ఆర్అండ్‌బీ రోడ్లు ధ్వంసమవుతున్నా పట్టించుకునే దిక్కు లేదు. నియంత్రించాల్సిన అధికారులు మామూళ్ల మత్తులో తూలుతున్నారు. దీంతో తమకెవరు అడ్డు అన్న చందంగా రోజు వందల సంఖ్యలో టిప్పర్లు కంకర లోడ్‌లతో తమిళనాడు సరిహద్దులు దాటుతున్నాయి. ప్రధానంగా సత్యవేడు మండలం చమర్తకండ్రిగ వద్ద మూడు కంకర క్వారీలు ఉన్నాయి. అలాగే వరదయ్యపాళెం మండలం మరదవాడ వద్ద రెండు క్వారీలు ఉన్నాయి. ఈ ప్రాంతం నుంచి రోజు వందల టిప్పర్లు కంకరను తమిళనాడుకు తరలిస్తున్నాయి. అయితే వీరికి నిబంధనలు ఏ మాత్రం అడ్డురావు.

రోజుకు 200కు పైగా టిప్పర్లు..

ప్రధానంగా చిన్న పాండూరు నుంచి నాగలాపురానికి వెళ్లే రోడ్డు మార్గంలో చమర్తకండ్రిగ వద్ద మూడు కంకర క్వారీలు ఉన్నాయి. ఈ మార్గంలో రోజువారీ తమిళనాడుకు 200కు పైగా టిప్పర్ లారీలతో కంకర తరలిస్తారు. ఓవర్ లోడ్‌తో రాకపోకలు చేస్తుండడంతో రోడ్లు ధ్వంసమవుతున్నాయి. ఆ మేరకు చిన్న పాండూరు నుంచి నాగలాపురానికి వెళ్లే రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. ప్రధానంగా చిన్న పాండూరు నుంచి చమర్తకండ్రిగ వరకు 12 కి.మీలు రోడ్డు బావులను తలపించే విధంగా రోడ్డు ధ్వంసమైంది. అటువైపుగా వెళ్లాల్సిన సామాన్య జనం, వాహనదారులు ఛిద్రమైన రోడ్డులో ప్రయాణించడానికి తీవ్ర అవస్థలు పడుతున్నారు.

నిలువరించేనా?

పరిమితికి మించి అదనపు టన్నేజీలతో తమిళనాడుకు వెళ్తున్న టిప్పర్లను రవాణాశాఖ అధికారులు నిలువరించే పరిస్థితి ఉందా? అన్నది ప్రస్తుతం ప్రశ్నార్థకంగా మారింది. రోజువారీ 200కు పైగా టిప్పర్లు 50 టన్నులకు పైగా బరువుతో పరిమితికి మించి రవాణా అవుతున్నా ఆ శాఖ అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడంపై విమర్శలు చెలరేగుతున్నాయి. వరదయ్యపాళెం మండలం మరదవాడ నుంచి రోజు పదుల సంఖ్యలో టిప్పర్లు అదనపు టన్నేజీతో తమిళనాడుకు తరలిపోతున్నా పట్టించుకునే దిక్కు లేదు. దీని కారణంగా నెలవాయి నుంచి తడ వరకు రోడ్లు ధ్వంసమయ్యాయి. ఇంత జరుగుతున్న రవాణా శాఖ అధికారులు మొద్దునిద్ర వీడడకపోవడం విస్మయానికి గురిచేస్తోంది.

కైవల్యానదిలో ఆక్రమణలు



మండల పరిషత్ కార్యాలయ సమీపంలో ఆక్రమణకు గురైన కైవల్యానది

- బఫర్ జోన్‌లో నిర్మాణాలకు అనుమతి
- పట్టించుకోని అధికారులు

సాక్షి టాస్క్‌ఫోర్స్ : వెంకటగిరి పట్టణంలో ప్రధానంగా ఉండే కైవల్యానదిలో సైతం ఆక్రమణలకు బరితెగిస్తున్నారు. వెంకటగిరి సమీపంలోని కొండ కింద ప్రాంతాల నుంచి డక్కిలి, బాలాయపల్లి, సైదాపురం మండలాల మీదుగా కైవల్యానది ప్రవహిస్తోంది. నది సమీపంలో కొందరు యథేచ్ఛగా ఆక్రమణలు సాగిస్తున్నారు. వర్షాకాల సమయంలో కొండ కింద ప్రాంతాల నుంచి వర్షపు నీటి ప్రవాహం కైవల్యానదిలో ఉధృతంగా ప్రవహిస్తుంటుంది. ఈ క్రమంలో కైవల్యానదిలో ఒడ్డున అక్రమ నిర్మాణాలు చేపడితే ప్రవాహానికి కొట్టుకుపోయే పరిస్థితి ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 2015లో కైవల్యానది 30 అడుగులపైకి వరద నీరు ప్రవహించి సమీపం ఒడ్డున తహసీల్దార్ కార్యాలయం, మండల పరిషత్ కార్యాలయాల్లోకి వరద నీరు సొచ్చుకొచ్చిన ఉదంతాలు ఉన్నాయి. అయితే బఫర్ జోన్‌లో నిర్మాణాలు చేపడుతుంటే అడ్డుకోవాల్సిన అధికారులు రికార్డులను తారుమారు చేసి నిర్మాణాలకు అనుమతులు ఇస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. మామూళ్ల ముట్టజెబుతుండడంతోనే అనుమతులకు అధికారులు పచ్చజెండా ఊపుతున్నారనే విమర్శలు గుప్పుమంటున్నాయి. వెంకటగిరిలో భూ ఆక్రమణలు రోజు రోజుకూ మితిమీరిపోతున్నాయని వాటిని నివారించాలని పలువురు కోరుతున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు దృష్టి సారించి బఫర్ జోన్‌లో ఆక్రమణలను తొలగించాలని పలువురు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో మెకానిక్ దుర్మరణం



మృతి చెందిన పేట లక్ష్మణ్

నాయుడుపేటటౌన్ : మండల పరిధిలోని మూర్తిరెడ్డి పాళెం గ్రామ సమీపంలో జాతీయ రహ దారిపై శనివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ట్రాక్టర్ మెకానిక్ పేట లక్ష్మణ్(29) దుర్మరణం చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు వివరాలు.. నాయుడుపేట పట్టణంలో నివాసం ఉంటున్న లక్ష్మణ్ ఓ ట్రాక్టర్ షోరూంలో మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. శనివారం సాయంత్రం ట్రాక్టర్ సర్వీసు చేసేందుకు వెళ్లి తిరిగి బైక్‌పై నాయుడుపేటకు వస్తున్నాడు. ఈ క్రమంలో మూర్తిరెడ్డి పాళెం గ్రామ సమీపంలో జాతీయ రహదారి వద్ద వెనుక నుంచి వేగంగా వస్తున్న ఐచర్ లారీ బైక్‌ను ఢీకొనడంతో లక్ష్మణ్ అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాద సమాచారం అందుకున్న ఎస్‌ఐ ఆదిలక్ష్మి, ఏఎస్‌ఐ ధర్మయ్య సంఘటనా స్థలం వద్దకు వెళ్లి పరిశీలించారు. ప్రమాదానికి కారణమైన మినీ లారీ వదిలి పెట్టి డ్రైవర్ పరారైనట్లుగా ఎస్‌ఐ గుర్తించారు. మినీ లారీను పక్కకు తరలించి ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చేశారు. లక్ష్మణ్ మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య , ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ప్రభుత్వ వైద్యశాల వద్దకు లక్ష్మణ్ కుటుంబ సభ్యులు, బంధువులు చేరుకుని విగత జీవిగా పడి ఉన్న లక్ష్మణ్ మృతదేహాన్ని చూసి కన్నీరుమున్నీరుగా విలపించారు.

ఉమ్మడి నోటిఫికేషన్ తుది జాబితా విడుదల

తిరుపతి తుడా: చిత్తూరు, తిరుపతి జిల్లాలకు సంబంధించి ఎస్వీ వైద్య కళాశాల, రుయా, ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రి లోని స్కూల్ ఆఫ్ నర్సింగ్, శ్రీపద్మావతమ్మ ప్రభుత్వ నర్సింగ్ కళాశాలల పరిధిలో గతంలో విడుదల చేసిన కంబైన్డ్ నోటిఫికేషన్కు సంబంధించి తుది జాబితాను విడుదల చేసినట్లు ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపల్ రవిప్రభు తెలిపారు. ఈ నోటిఫికేషన్కు సంబంధించిన పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఇందులో ఏమైనా ఫిర్యాదులు ఉంటే ఈనెల 26 సాయంత్రం 5 గంటల్లోపు సంబంధిత ధ్రువీకరణ పత్రాలతో ప్రిన్సిపల్ కార్యాలయంలో వ్యక్తిగతంగా సమర్పించాలని ఆయన సూచించారు.

తొలి విడతలో 25 శాతం అడ్మిషన్లు

తిరుపతి సిటీ: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు డిగ్రీ కళాశాలల్లో ఇప్పటి వరకు తొలివిడత అడ్మిషన్లు 25 శాతం మించకపోవడం విశేషం. ఉన్నత విద్యామండలి వ్యవహార శైలితో నాలుగు నెలల ఆలస్యంగా ప్రారంభమైన డిగ్రీ ప్రవేశాల ప్రక్రియ నత్తనడకన నడుస్తోంది. జిల్లాలో 17 ప్రభుత్వ కళాశాలల్లో ఇప్పటి వరకు 25 శాతం అడ్మిషన్లు మాత్రమే జరిగినట్టు అధికారిక సమాచారం. డిగ్రీ కోర్సులపై విద్యార్థులు పెద్దగా మొగ్గు చూపనట్టు తొలివిడత అడ్మిషన్ల ప్రక్రియను పరిశీలిస్తే అర్థమవుతోంది. టీటీడీ ఆధ్వర్యంలో నడుస్తున్న ఎస్వీ ఆర్ట్స్, ఎస్వీడబ్ల్యూ, ఎస్‌జీఎస్ ఆర్ట్స్ కళాశాలలో కాస్త మెరుగ్గా 45 శాతం ప్రవేశాలు జరిగినట్లు అధికారులు వెల్లడించారు. సోమవారం తొలివిడత అడ్మిషన్లకు చివరి తేదీగా ఉన్నత విద్యామండలి నిర్ణయించిన విషయం విదితమే. మలివిడత అడ్మిషన్లపై ఇప్పటి వరకు ఉన్నత విద్యామండలి స్పష్ట ఇవ్వాల్సి ఉంది.

ప్రాణం తీసిన ఈత సరదా

- బాలుడి మృతి, మరొకరు గల్లంతు



షేక్ హరూన్ మృతదేహం

శ్రీకాళహస్తి : పట్టణంలో ముత్యాలమ్మ గుడివీధికి చెందిన 4వ తరగతి చదువుతున్న బాలుడు షేక్ హరూన్ (8) శనివారం నీటిపారుదలశాఖ కార్యాలయం సమీపంలో స్వర్ణముఖినదిలోకి ఈతకు వెళ్లి మృతి చెందాడు. మరో బాలుడు గుణ(14) గల్లంతయ్యాడు. 1వ పట్టణ సీఐ గోపి కథనం మేరకు .. సాయంత్రం 4 గంటల సమయంలో హరూన్‌తో పాటు కార్తీక్ (12), అనిల్(11), మరో ఇద్దరు గుర్తు తెలియని పిల్లలు మొత్తం ఆరుగురు స్వర్ణముఖినదిలో ఈతకొడుతున్న సమయంలో హరూన్, గుణ ప్రమాదవశాత్తు వేగంగా వస్తున్న నీటిలో కొట్టుకుపోయారు. అది చూసి నలుగురు పిల్లలు కేకలు వేయ గా మున్సిపాలిటీలో పని చేసే అరుణ్ గమనించి కాపాడే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. హరూన్ మృతదేహాన్ని బయటకు తీయగా మరొక బాలుడి ఆచూకీ లభ్యం కాలేదు. కుమారుడు నీట మునిగి మృతి చెందంతో నజీర్ కుటుంబం శోకసంద్రంలో మునిగిపోయింది. గల్లంతయిన బాలుడు గుణ రామచంద్రయ్య కుమారుడిగా గుర్తించారు. అతడి ఆచూకీ తెలియరాలేదు. పోలీసులు కేసు నమోదు చేసి , గల్లంతైన బాలుడు కోసం గాలిస్తున్నారు.

స్వర్ణముఖి ప్రవాహంలో రైతు గల్లంతు



పాపయ్య (ఫైల్)

పెళ్లకూరు : స్వర్ణముఖినది ఆవల తీరాన ఉన్న పొలాల్లో వ్యవసాయ పనులు ముగించుకొని తిరిగి ఇంటికెళ్లే సమయంలో నదిని దాటుతుండగా నీటి ప్రవాహంలో చమర్తి పాపయ్య(65) అనే రైతు గల్లంతైన ఘటన శనివారం పెళ్లకూరు మండలంలో చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు సమాచారం మేరకు చిల్లకూరు వడ్డిపాళెం గ్రామానికి చెందిన చమర్తి పాపయ్య వ్యవసాయ పనుల నిమిత్తం స్వర్ణముఖి నదిని దాటుకొని పొలాల్లోకి వెళ్లి పనులు ముగించుకొని సాయంత్రం ఇంటికి వెళ్లే క్రమంలో నదిని దాటుతుండగా అప్పటికే తెలుగు గంగ జల ప్రవాహం స్వర్ణముఖినదిలో ఎక్కువ కావడంతో నీటి ప్రవాహంలో పాపయ్య కొట్టుకుపోయాడు. సమాచారం అందుకున్న స్థానిక ఎస్‌ఐ నాగరాజు, నాయుడుపేట అగ్నిమాపక సిబ్బందితో కలిసి గాలింపు చర్యలు చేపట్టారు. కానీ రాత్రి సమయం కావడంతో పాపయ్య ఆచూకీ లభించలేదు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

హత్యాయత్నంలో ఒకరు.. గంజాయి కేసులో మరొకరు అరెస్టు



నిందితుడి అరెస్టు చూపుతున్న పోలీసులు

సత్యవేడు : హత్యాయత్నం కేసుకు సంబంధించి సత్యవేడు హరిజనవాడకు చెందిన నిందితుడు సీమాన్ (25)ను శనివారం అరెస్టు చేయగా, గంజాయి కేసులో సత్యవేడు పంచాయతీలోని దళవాయి అగ్రహారానికి చెందిన నిందితుడు శ్రీధర్ (34)ను అరెస్టు చేసినట్లు సీఐ మురళీనాయుడు తెలిపారు. పోలీసుల కథనం మేరకు నిందితుడు శ్రీధర్ నుంచి రూ.20 వేలు విలువ చేసే 1.5 కేజీల గంజాయి, బైక్‌ను స్వాధీనం చేసుకొని అరెస్టు చేసి రిమాండ్ కు తరలించామన్నారు. అలాగే మరో కేసులో జులై 15 తేదీన శ్రీ సిటీ కంపెనీలో పని ముగించుకొని సత్యవేడు – శ్రీకాళహస్తి బస్టాండు సమీపంలో ఆటోను అడ్డగించి సీమాన్ గొడవ చేశాడన్నారు. కొన్ని రోజులుగా అదే ఆటోలో ప్రయాణిస్తున్న వారిని సీమాన్ అతని సోదరుడు లారెన్స్ కలిసి కత్తులతో దాడి చేశాడన్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు తెలిపారు. వీరి ఇరువురిపై తడ, తమిళనాడు స్టేషన్‌లలో పలు కేసులు నమోదైనట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎస్‌ఐ రామస్వామి, కానిస్టేబుల్ శ్రీధర్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా కళాంగిణి వేడుక

– తిరుపతి ఐఐటీలో ఆర్ట్ వర్క్‌షాప్ విజయవంతం

ఏర్పేడు : ఏర్పేడు సమీపంలోని తిరుపతి ఐఐటీలో శనివారం ఆర్ట్ వర్క్ షాప్ వేడుకగా జరిగింది. ఐఐటీకి సంబంధించి ఆర్టిస్ట్రా ది ఆర్ట్ క్లబ్ ఆధ్వర్యంలో శని, ఆదివారాలు రెండు రోజులపాటు తలపెట్టిన కళాంగిణి వేడుక శనివారం ప్రారంభం కాగా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఐఐటీ, ఐసర్ విద్యా సంస్థలకు చెందిన విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. తిరుపతికి చెందిన మహిళా ఆర్టిస్టులు రాగిమాను శ్రీదేవి, జి.గాయత్రీ దేవి, బత్తుల అర్చన, ఎస్.లావణ్య వర్క్ షాప్‌లో పాల్గొని పెయింటింగ్‌లో మెలకువలు నేర్పించారు. కార్యక్రమంలో ఫ్యాకల్టీ అడ్వైజర్ పంచేటి జష్టివ్, ఆర్ట్ క్లబ్ హెడ్ అర్నా రుబీన్, మెంటర్ రోహన్ రతన్, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

ఐజర్‌లో సింపోజియం


ఏర్పేడు : మండలంలోని జంగాలపల్లి సమీపంలోని తిరుపతి ఐజర్‌లో శనివారం విద్యార్థులకు ఎర్లీ కెరియర్ రీసెర్చ్ సిపోజియం జరిగింది. ఐజర్, తిరుపతి ఐఐటీ , జర్మనీ అకడమిక్ ఎక్స్చేంజ్ సర్వీస్‌తో పాటు బంగ్లాదేశ్, భూటాన్, భారత్, నేపాల్, శ్రీలంకకు చెందిన డీఏఏడీ రీసెర్చ్ అంబాసిడర్ల నెట్‌వర్క్ సహకారంతో ఎర్లీ కెరియర్ రీసెర్చ్ సింపోజియం ఘనంగా జరిగింది. ''ఇంటిగ్రేటివ్ బయోసైన్సెస్ – డేటా డ్రైవన్ డిస్కవరీ'' అనే అంశంపై నిర్వహించిన ఈ సదస్సులో బయాలజీ, డేటా సైన్స్ రంగాల అనుసంధానంపై ప్రసంగాలు, చర్చలు నిర్వహించారు. ఐజర్ రిజిస్ట్రార్ ఇందర్‌ప్రీత్ సింగ్ కోహ్లీ, లెఫ్టినెంట్ కల్నల్ కె. హిమాంశు శేఖర్ పాల్గొన్నారు.

తిరుమల పవిత్రతను కాపాడుదాం

తిరుమల: తిరుమల పవిత్రత, ప్రశాంతత కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని, ముఖ్యంగా భక్తులకు సరైన సమాచారం అందించే విషయంలో మీడియా పాత్ర మరింత కీలకమైనదని టీటీడీ అదనపు ఈఓ సి.హెచ్.వెంకయ్య చౌదరి అన్నారు. తిరుమలలోని అన్నమయ్య భవన్‌లో శనివారం టీటీడీ సీవీఎస్వో మురళీకృష్ణతో కలిసి మీడియా ప్రతినిధులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మీడియా ప్రతినిధుల నుంచి ప్రయోజనకరమైన సూచనలను ఎల్లప్పుడూ స్వాగతిస్తామని పేర్కొన్నారు. ఇటీవల కాలంలో సోషల్ మీడియా వేగంగా పెరుగుతోందని, కానీ చాలామంది యూట్యూబర్లు భక్తులకు సరైన సమాచారం ఇవ్వకుండా, అవాస్తవమైన వార్తలతో గందరగోళానికి గురి చేస్తున్నారని చెప్పారు. ఇటువంటి తప్పుడు వార్తలు ప్రపంచవ్యాప్తంగా ఉండే శ్రీవారి భక్తుల మనోభావాలు దెబ్బ తినే అవకాశం ఉంటుందని తెలిపారు. తిరుమల కొండ పవిత్రతను కాపాడటం, టీటీడీ కార్యక్రమాలను ప్రోత్సహించే విషయంలో మీడియాపై ఎంతో బాధ్యత ఉందని అభిప్రాయపడ్డారు. తిరుమలలో ఎన్నో ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్న మీడియా ప్రతినిధులకు తిరుమలలో జరుగుతున్న అభివృద్ధిపై, భక్తులకు టీటీడీ అందిస్తున్న విశేష సేవలపై ఎంతో అవగాహన ఉంటుందని తెలిపారు. టీటీడీపై అసత్య కథనాలతో దుష్ప్రచారం చేసే వారిని నియంత్రించేందుకు మీడియా ప్రతినిధులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. వాస్తవాలను ప్రజలకు చేరవేయాలని కోరారు. ఈ సమావేశంలో డీఎఫ్వో ఫణి కుమార్ నాయుడు, సీపీఆర్వో డాక్టర్ టి. రవి, వీజీవోలు రామ్ కుమార్, సురేంద్ర ఇతర అధికారులు పాల్గొన్నారు.

కాశిపెంట్లలో దోపిడీ దొంగల బీభత్సం

- ఇంట్లో ఉన్న వృద్ధుల చేతులు కట్టేసి దోపిడీ
- రూ.70 వేల నగదు, బంగారంతో పరారీ



ఇంట్లో నుంచి పారిపోతున్న దొంగ



దొంగలు చేతులు కట్టేశారని చెబుతున్న బాధితులు

చంద్రగిరి: మండలంలో దోపిడీ దొంగలు బీభత్సం చేశారు. ముఖానికి ముసుగు ధరించి గోడదూకి ఇంట్లోకి ప్రవేశించి, వృద్ధుల చేతులు కాళ్లు కట్టేసి అందిన కాడికి దోచుకెళ్లిన ఘటన శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. బాధితుల కథనం మేరకు, మండల పరిధిలోని కాశిపెంట్లకు చెందిన నాగేశ్వరరావుతోపాటు మరో ఇద్దరు వృద్ధులు నివాసం ఉంటున్నారు. నాగేశ్వరరావు వృద్ధులతో కలసి అమెరికాలో ఉన్న కుమారుడు ప్రసాద్ తో శుక్రవారం రాత్రి వీడియో కాల్లో మాట్లాడుతున్నారు. ఈ క్రమంలో కారులో వచ్చిన గుర్తు తెలియని నలుగురు యువకులు నాగేశ్వరరావు ఇంటి ముందు ఆగి, హారన్ మోగించారు. ఎవరో వచ్చారంటూ బయటకు వచ్చిన నాగేశ్వరరావుపై దాడి చేసి ఇంటి లోపలకు బలవంతంగా లాక్కెళ్లారు. ఆపై నాగేశ్వరరావుతోపాటు మరో ఇద్దరు వృద్ధుల చేతులు కట్టేసి, కత్తులతో బెదిరించారు. ఆపై ఇంట్లో ఉన్న రూ.70వేల నగదు, బంగారు ఆభరణాలను దోచుకున్నారు. వీడియో కాల్లో ఉన్న కుటుంబ సభ్యుడు దొంగతనాన్ని పసిగట్టి వెంటనే తన సెల్‌ఫోన్ నుంచి సీసీ కెమెరాలను పరిశీలించారు. అనంతరం చుట్టుపక్కల వారికి ఫోన్ చేసి దోపిడీ దొంగలు పడ్డారని, ఇంట్లో వారిని బెదిరిస్తున్నారని తెలియజేశారు. అప్పటికే ఇంటిని దోచేసిన దుండగులు గోడదూకి కారులో పరారయ్యారు. ఈ క్రమంలో గ్రామస్తులు కారును వెంబడించడంతో పాటు కారుపై దాడికి యత్నించారు. అయినప్పటికీ దొంగలు అక్కడి నుంచి పారిపోయారు. ఈ మేరకు బాధితుడు నాగేశ్వరరావు పోలీసులకు సమాచారం అందించడంతో ఇన్‌చార్జ్ సీఐ ఇమ్రాన్ బాషా తన సిబ్బందితో కలసి ఇంటిని పరిశీలించారు. దోపిడీ దొంగల బీభత్సం రికార్డు అయిన సీసీ కెమెరాలను పరిశీలించారు.